
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
శనివారం 1 జూన్ 2024



కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద



బాధ్యతలు స్వీకరించిన శివానందకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

- 7లో

భారీగా బెట్టింగ్



ఎన్నికల ఫలితాలపై విపరీతంగా పందాలు

- కూటమి గెలుస్తుందని అత్యధికులు...
- వైసీపీపై కాసేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి
- దాంతో కీలక నియోజక వర్గాల ఫలితాలు, ప్రముఖుల మెజారిటీలపై పందెంరాయుళ్ల దృష్టి
- శ్రీకాకుళం, చీపురుపల్లి, విశాఖపట్నం నార్త్, వెస్ట్, మాడుగుల, పాడేరు నియోజకవర్గాల్లో గెలుపు/ఓటములపై...
- చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు లభించే మెజారిటీలపైనా బెట్టింగ్
- టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీలకు లభించే ఎంపీ స్థానాలపై కూడా...
- చేతులు మారుతున్న రూ.కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరో మూడు రోజుల్లో వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు స్పీడ్ పెంచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న దానిపైనే పందాలు సాగు తుంటాయి. ఈసారి కూడా ఏప్రిల్ నెలాఖరు వరకూ అలాగే నడిచింది. అయితే, మే నెల ప్రారంభం నుంచి మాత్రం వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కాసేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా పోలింగ్ తరువాత కూటమి విజయం సాధిస్తున్న టాక్ రావడంతో వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్ల ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయి?, చీపురుపల్లి, ఎచ్చెర్ల, గజపతినగరం వంటి నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారు?, అలాగే ఉమ్మడి విశాఖ నగర పరిధిలోని నార్త్, పశ్చిమ నియోజకవర్గాల ఫలితాలపై పందాలు వేస్తున్నారు. విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సాధించే మెజారిటీ, అలాగే అనకాపల్లి జిల్లా మాడుగుల, అల్లూరి జిల్లా పాడేరు నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై బెట్టింగ్ కడుతున్నారు.

కూటమి వైపు జోరుగా పందాలు..

ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందన్న అభి ప్రాయాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేస్తుండడంతో.. అటువైపు పందాలకు అత్యధికులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వైసీపీ గెలుస్తుందని పందెం కాసేందుకు ఎవరూ దొరక్క పోవడంతో...హోరీహోరీగా పోటీ జరిగిన నియోజక వర్గాలపై దృష్టిపెట్టారు. శ్రీకాకుళం జిల్లాలో మంత్రి ధర్మాన ప్రసాద రావు, చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణల గెలుపు/ ఓటములపై, అలాగే పలాస, నరసన్నపేటల్లో కూటమి అభ్యర్థుల విజయంపై జోరుగా పందాలు సాగుతున్నాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానంపై పందెం కాసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. విజయనగరం ఎంపీ స్థానంపై మాత్రం జోరుగా పందాలు సాగుతున్నాయి. మొన్నటి వరకు వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ గెలుస్తారంటూ ... మిగతా 8వ పేజీలో

మన్యంలో ఇసుక దందా!

సరఫరాపై చేతులెత్తేసిన వైసీపీ సర్కారు

- అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో అక్రమ తవ్వకాలు
- స్థానిక గెడ్డల నుంచి యథేచ్ఛగా తరలింపు
- హుకుంపేట, పెదబయలు, అనంతగిరి మండలాల్లో అక్రమ క్వారీలు
- దృష్టి సారించని అధికారులు



హుకుంపేట మండలం కామయ్యపేటలో ఇసుకను అక్రమంగా తవ్వి లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం(ఫైల్)

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యం వాసులకు ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కనీసం ఇసుకను కూడా అందించలేక చేతులెత్తేసింది. రాష్ట్రంలోని దాదాపు 25 జిల్లాల్లో ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి, టన్ను రూ.1,650 చొప్పున విక్రయించి, సొమ్ముచేసుకున్న సంగతి తెలిసిందే. కానీ మన్యంలో మాత్రం అందుబాటులోకి తేలేదు. దీంతో స్థానికంగా ఉండే గెడ్డల్లోని ఇసుకనే గిరిజనులు తమ అవసరాల కోసం వినియోగించుకోవాల్సిన పరిస్థితి. అంతేకాదు అధికార వైసీపీ నేతలు మాఫియాగా ఏర్పడి గెడ్డల్లోని ఇసుకను కూడా తరలించేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో ఇసుక డిపోను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిబంధన మన్యంలో అమలుకాలేదు. అధికారిక ఇసుక రీచ్‌లు, డిపోలు లేకపోవడంతో హుకుంపేట, పెదబయలు, అనంతగిరి మండలాల్లో ఇసుక అక్రమ క్వారీలు కొనసాగిస్తున్నారు.



పెదబయలు మండలం మంగబంద వద్ద ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు

ఏజెన్సీలోని పెదబయలు, హుకుంపేట మండలాల్లోని మత్స్యగెడ్డ, అనంతగిరి మండలంలో గోస్తనీ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. స్థానికంగా రైతులు తమ పంట పొలాల్లోని మట్టిని తవ్వుకుని సమీపంలోని పొలాల్లోకి తరలిస్తుంటే పట్టుకునే అధికారులు, ఇసుక అక్రమ తవ్వకాలపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఇసుక దందా నిర్వహిస్తున్న వైసీపీ నేతల ఆగడాలను అడ్డుకోలేకనే అధికారులు మౌనంగా ఉండిపోతున్నారని చెబుతున్నారు.

పోలీస్, రెవెన్యూ అధికారుల అండతోనే....

మన్యంలో ఇసుక దందాను కొనసాగిస్తున్న అధికార పార్టీ నేతలకు స్థానికంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో మైనింగ్ అధికారులు ప్రమేయంగా లేకపోవడంతో కేవలం పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతోందని సమాచారం. ఆయా శాఖల అధికారులకు ముడుపులు అందకపోతేనే ఇసుక లారీలను పట్టుకుని జరిమానాలు విధించడం, కేసులు నమోదుచేయడం జరుగుతోందని, నెల నెలా ముడుపులు చెల్లిస్తే కళ్ల ముందే లారీల్లో ఇసుక తరలిపోతున్నా పట్టించుకోరనే విమర్శలున్నాయి. ఏజెన్సీలోని హుకుంపేట మండలంలో దిగుడుపుట్టు, పెదగరువు, కామయ్యపేట, గరుడాపల్లి, పందిమెట్ట, పెదబయలు మండలం మంగబంద, చుట్టుమెట్ట, అరడకోట ప్రాంతాల్లోని మత్స్యగెడ్డలో ఏడు చోట్ల ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. హుకుంపేట మండలంలో వైసీపీకి చెందిన నేతలే లారీ ఇసుకకు రూ.300 చొప్పున సీనరేజీ పేరిట వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కో క్వారీలో రోజుకు కనీసం 50 లారీల ఇసుక తరలిపోతోంది. పెదబయలు మండలంలోని కూడా ఇంతే మొత్తం వసూలు చేస్తున్న మొత్తాన్ని కలెక్టర్ అనుమతితో పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తున్నామని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. అయితే తెర వెనుక వైసీపీ నేతలే ఈ తతంగం నడిపిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. స్థానిక వైసీపీ నేతల ప్రమేయంతో అనంతగిరి మండలం కాశీపట్నంలోని గోస్తని నదిలోని ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ భవనాలకు అవసరమైన ఇసుకను స్థానికంగా గెడ్డల నుంచి సేకరించుకోవచ్చుననే రెవెన్యూ అధికారుల అనుమతి పత్రాలను ఆసరాగా చేసుకుని పలువురు వైసీపీ నేతలు దొడ్డిదారిన ఇసుక విక్రయాలకు పాల్పడుతున్నారని తెలుస్తున్నది. ఏది ఏమైనా గతంలో లారీ ఇసుక రూ.3 వేలు, ట్రాక్టర్ రూ.1500 ఉండగా, వైసీపీ నేతల దందాతో వినియోగదారులు లారీ లోడు రూ.6 వేలు, ట్రాక్టర్‌కు రూ.3 వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మన్యంలో ఇసుక దందాకు అడ్డుకట్ట వేసి, తక్కువ ధరకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు



ఆసక్తి చూపుతున్న కొయ్యూరు మండల రైతులు

- బీర సాగులో అంతర పంటగా ఆగాకర
- ఈ ఏడాది సుమారు 500 ఎకరాలకు పైగా సాగు



బీర పాదులు

కొయ్యూరు, మే 31:

మండలంలో పలువురు రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. లాభాలు ఆశాజనకంగా ఉండడంతో దీనిపై శ్రద్ధ చూపుతున్నారు. ఎక్కువ మంది రైతులు బీర సాగులో అంతర పంటగా ఆగాకర సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మండల వ్యాప్తంగా కూరగాయల సాగు జరుగుతున్నప్పటికీ ప్రత్యేకంగా కంఠారం, బాలారం, కొమ్మిక పంచాయతీల్లో ఎక్కువ మంది రైతులు ఈ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా ఎకరాకు దుక్కి, పందిర్లు, విత్తుకోవడానికి రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకు ఖర్చు చేసి ఇప్పటికే విత్తనాలు వేశారు. పలు చోట్ల బీరపాదుల కోసం పందిర్లు వేశారు. వీఎస్ఆర్ బీర రకం విత్తనాలు ప్యాకెట్ ఒక్కింటికి రూ.580 వంతున కొనుగోలు చేసి ఎకరానికి నాలుగు ప్యాకెట్ల విత్తనాలు విత్తారు. ఇందులో అంతర్ పంటగా స్థానికంగా దొరికే ఆగాకర విత్తనాలు కేజీ రూ.750 వంతున కొనుగోలు చేసి ఎకరానికి రెండు కేజీలు చొప్పున వేశారు. మరో 20 రోజుల్లో బీర ఫలసాయం చేతికి వచ్చేలా సాగు చేస్తున్నారు. సుమారు రెండు నెలల పాటు బీరకాయలు మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. అనంతరం ... మిగతా 8వ పేజీలో



ఆగాకర పాదులు

ప్రకృతిని ఎరగా వేసి దోపిడీ!

పర్యాటకుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అటవీ అధికారులు

- గుడిసె ఎకో టూరిజం ప్రాజెక్టు నిధుల్లో చేతివాటం
- కమిటీ లేకుండానే సీబీఈటీ కార్యకలాపాలు
- ఆకుమామిడికోటలో అనధికార చెక్‌పోస్టు నిర్వహణ
- దృష్టి సారించని ఫారెస్టు ఉన్నతాధికారులు



గుడిసె విహార కేంద్రం

(రంపచోడవరం/మారేడుమిల్లి)

పర్యాటకులకు ప్రకృతిని ఎరగా వేస్తున్న అటవీ అధికారులు వారిని ఆకర్షించి తద్వారా వచ్చే ఆదాయాన్ని దేచేస్తున్నారు. ఈ తరహా దోపిడీ రంపచోడవరం అటవీ డివిజన్లో ప్రహసనంగా సాగుతోంది. డివిజన్లోని పలు రేంజిల పరిధిలో పర్యాటకం కోసం పలు కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం (సీబీఈటీ) ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో కీలకంగా మారేడుమిల్లి రేంజి పరిధిలోని గుడిసె, మారేడుమిల్లి, వాలమూరు గొంది సీబీఈటీల ద్వారానే పర్యాటకుల నుంచి అధిక ఆదాయం సమకూరుతోంది. ఇందులో గుడిసె సీబీఈటీకి పర్యాటకుల తాకిడితో పాటు ఆదాయమూ ఎక్కువే! ఈ సీబీఈటీ కార్యకలాపాల నిర్వహణలో సంబంధిత అటవీ అధికారుల తీరుపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఆకుమామిడికోటలో చెక్‌పోస్టు

ముఖ్యంగా గుడిసె ఏకో టూరిజం ప్రాజెక్టు నిర్వహణ చుట్టూనే ఆరోపణలు తిరుగుతున్నాయి. సీబీఈటీలకు గిరిజనులే సభ్యులుగా కమిటీలను ఏర్పాటుచేసి వాటి ద్వారానే నిర్వహణ సాగించడం నిబంధన. ఈ ప్రకారం గుడిసె సీబీఈటీకి కమిటీని నియమించడం, కమిటీ ఛైర్మన్‌తో కలిపి మారేడుమిల్లిలోని యూనియన్ బ్యాంకులో ఖాతాను కూడా తెరిచారు. కాగా గుడిసె సీబీఈటీ కమిటీని అక్టోబరు 2023లో అటవీ అధికారులు రద్దుచేశారు. నేటికీ కొత్త కమిటీని నియమించకుండానే కార్యకలాపాలను నిర్వహించడం వివాదాస్పదంగా మారుతోంది. గుడిసె విహారానికి వచ్చే పర్యాటకుల నుంచి అధికారికంగా, కొంత అనధికారికంగా కొంత సొమ్ము వసూలు చేస్తున్నారు. అధికారికంగా వసూలుచేసిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, ఆనక డ్రా చేయడం నిత్యకృత్యమవుతోంది. ఈ విధంగా గత ఏడునెలల్లో లక్షలాది రూపాయలను విత్‌డ్రా చేశారని సమాచారం. కమిటీ లేకుండా బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు ఎలా డ్రా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

చెక్‌పోస్టును ఎత్తేసి...

గుడిసె విహారయాత్రికులను క్రమబద్ధీకరించి, రుసుము వసూలు చేసేందుకు సమీపంలోనే చెక్‌పోస్టును నిర్వహించేవారు. గతంలో రాజమండ్రి అటవీశాఖ సీసీఎఫ్ పర్యటనకు వచ్చిన సమయంలో చెక్‌పోస్టును ఎత్తేయాలని అటవీ అధికారులకు సూచించారు. దాంతో అది మూతపడింది. అనంతరం గుడిసెకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుమామిడికోటలో చెక్‌పోస్టును ఏర్పాటుచేసి గుడిసెకు వచ్చే విహారయాత్రికుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. కానీ ఆకుమామిడికోటలో చెక్‌పోస్టు ఏర్పాటుకు సీసీఎఫ్ నుంచి ఎటువంటి అనుమతులూ లేవని సమాచారం. ఇదే నిజమైతే చెక్‌పోస్టు ద్వారా గుడిసె పర్యాటకుల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నట్టే! ఇదిలావుండగా ఇది గిరిజన ప్రాంతం కావడం, అటవీ హక్కుల చట్టం పరిధిలోనిది కావడంతో గిరిజనులకు ఉన్న సామాజిక హక్కుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు సాగిస్తున్న ఈ కార్యకలాపాలకు సంబంధించి పుల్లంగి పంచాయతీలో పీసా గ్రామసభ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.



పాడేరు మెయిన్‌రోడ్డులో గొడుగు వేసుకుని వెళుతున్న మహిళలు


భానుడు భగభగ... జనం విలవిల

- మన్యంలో తీవ్రమవుతున్న ఎండలు
- కొయ్యూరులో అత్యధికంగా 41.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మన్యంలో భానుడు తీవ్ర ప్రతాపం చూపుతున్నాడు. రోహిణి కార్తె నేపథ్యంలో రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నది. దీంతో ఉష్ణోగ్రతలు భారాగా నమోదవుతున్నాయి. కొయ్యూరులో శుక్రవారం 41.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. గత వారం రోజులుగా ఉదయం నుంచే ఎండ ప్రభావం చూపిస్తోంది. మధ్యాహ్నం వేళల్లో ఎండ ధాటికి రోడ్లపై జనం సంచారం కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. దీంతో మన్యం వాసులు అల్లాడుతున్నారు. కొయ్యూరులో అత్యధికంగా 41.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అనంతగిరిలో 34.6, అరకులోయలో 36.3, చింతపల్లిలో 38.0, డుంబ్రిగుడలో 36.3, జీకేవీధిలో 39.5, జి.మాడుగులలో 39.5, హుకుంపేటలో 36.3, ముంచంగిపుట్టు, పాడేరు 39.5, పెదబయలులో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చింతపల్లిలో ఎండ, వాన...

చింతపల్లి: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఒక్కసారిగా గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో ... మిగతా 8వ పేజీలో



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 31: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శాస్త్రవేత్తలు ఓ ప్రకటన విడుదల చేశారు. పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఈనెల 5వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు. కనిష్ఠంగా ఒక మిల్లీమీటరు నుంచి గరిష్ఠంగా పది మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

- లోయలోకి దూసుకుపోయిన బైక్
- తండ్రీ,కొడుకు మృతి
- తల్లి, కుమార్తెకు తీవ్ర గాయాలు

- వివరాలు మెయిన్‌లో



ప్రమాదంలో మృతిచెందిన తండ్రీకుమారులు రాంబాబు, ప్రశాంత్

జిల్లాలో 18,809 మందికి ఇంటి వద్ద పింఛన్

- మిగిలిన వారికి బ్యాంకు ఖాతాల్లో జమ

పాడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను శనివారం నుంచి చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 22 మండలాల్లో 1,27,894 మంది లబ్ధిదారులుండగా వారిలో 1,09,085 మందికి రూ.32,75,96,000 బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు. కదలలేని స్థితిలో ఉన్న 18,809 మందికి ఇంటి వద్దనే పింఛన్ అందించనున్నారు. పింఛన్ల కోసం సచివాలయాలకు రావద్దని అధికారులు తెలిపారు.

క్రైం... crime news

సరదాగా స్నేహితుడితో వచ్చి...

- హైవేపై లారీలో ఇద్దరు అనుమానాస్పద మృతి
- మృతులు అనకాపల్లి జిల్లా వాసులు
- అతి మద్యం, వడదెబ్బ కారణమని అనుమానం
- లారీ డ్రైవర్ ఫిర్యాదుపై కేసు నమోదు

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, మే 31: అతిగా మద్యం సేవించటంతో పాటు వడదెబ్బకు గురై లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై నవాబుపేట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. అనకాపల్లి నుంచి జగ్గయ్యపేటకు బొగ్గులోడ్‌తో గురువారం రాత్రి బయల్దేరిన లారీలో డ్రైవర్ కనగాల అప్పారావుతో పాటు ఆయన స్నేహితులు పాటు నర్సింగరావు, సత్యనారాయణలు సరదాగా వస్తామని బయల్దేరారు. బయల్దేరినప్పటి నుంచి వారిద్దరు మద్యం సేవించటం, గత రెండు రోజులగా ఎండ వేడిమి తీవ్రంగా ఉండటం, వడగాడ్పులకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి నీరసపడ్డారని డ్రైవర్ చెబుతున్నాడు. హైవేపై నవాబుపేట వద్ద సాయంత్రం వారిద్దరు లారీలో ఎంత లేపిన లేవకపోవటంతో అనుమానం వచ్చి చూడగా అపస్మారకస్తితిలో ఉన్నారని, అంబులెన్స్‌లో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడ వారు చనిపోయినట్టు గుర్తించారు. నర్సింగరావు(55) ఎస్‌బీఐలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌లో ఉన్నాడని, సత్యనారాయణ (63) విశాఖస్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి రిటైరై ఖాళీగా ఉంటున్నాడని డ్రైవర్ తెలిపాడు. లారీ జగ్గయ్యపేటకు చెందిన ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుది కాగా, ఇక్కడ నుంచి సిమెంట్ లోడ్‌తో వైజాగ్ వెళ్లి తిరుగుముఖంలో బొగ్గులోడ్‌తో వస్తున్నట్టు డ్రైవర్ చెప్పారు. పెనుగంచిప్రోలు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

బాలికపై అత్యాచారం

- నిందితుడు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

అనకాపల్లి, మే 31: పాయకరావుపేట మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలానికి చెందిన 14 సంవత్సరాల బాలిక మూడేళ్లుగా పాయకరావుపేట మండలంలో నానమ్మ, తాతగారి ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. ఈ ఏడాది 8వ తరగతి పూర్తిచేసిన బాలిక వేసవి సెలవులకు తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. తాతకు దగ్గర బంధువైన 35 ఏళ్ల వయస్సు వ్యక్తి తరచూ ఇంటికి వచ్చేవాడని, ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంట్లో ఒంటరిగా ఉన్న తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక తన తల్లికి చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చి పెద్దమనుషుల సమక్షంలో నిందితుడిని నిలదీయగా అతను బుకాయించాడు. అంతేకాకుండా బాలిక తల్లిదండ్రులపై దాడి చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రాంబిల్లి, మే 31: మండలంలోని జంగాలపాలెం సమీపంలోని లోటస్ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైలోకు చెందిన బద్ది దుర్గ (35) తీవ్రంగా గాయపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో జంగాలపాలెం సమీపంలోని లోటస్ స్కూల్ వద్ద దుర్గ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో దుర్గకు తీవ్ర గాయాలయ్యాయి, విషయం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన మహిళ దుర్గను విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దుర్గ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీ

నర్సీపట్నం, మే 31: మెడలోని బంగారు ఆభణాల చోరీపై ఇక్కడి బలిఘట్టం గ్రామానికి చెందిన సుర్ల బెన్నయ్యనాయుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. గురువారం రాత్రి భార్య, పిల్లలతో కలిసి తమ ఇంటి డాబాపై నిద్రపోయామన్నారు. అర్ధరాత్రి సమయంలో తన భార్య రాజేశ్వరి మెడలోని రెండు తులాల పుస్తెలతాడు, తులం శతమానాలు కనిపించడం లేదని వాపోయిందన్నారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

20 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మే 31: మండలంలోని తాళ్లపాలెం గ్రామ శివారున మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అచ్చెర్ల గ్రామానికి చెందిన చందనాల రాజు పది మద్యం క్వార్టర్ బాటిళ్లు, జమ్మాదులపాలెం గ్రామానికి చెందిన డి.ఈశ్వరరావు 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద


శివానందను పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.శివానంద నియమితులయ్యారు. ఆస్పత్రిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ అశోక్ కుమార్ నెల రోజులు సెలవు పెట్టారు. ఈ సెలవు కాలానికి సూపరింటెండెంట్‌గా ఆర్థో విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ శివానందను నియమిస్తూ డీఎంఈ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ ఎం.శంకరరావు నియమితులయ్యారు. ఆయన సుదీర్ఘకాలంగా సెలవులో ఉన్నారు. కొద్దిరోజుల కిందట వరకు ఆ స్థానంలో పనిచేసిన లక్ష్మీ తులసిని ఆరోపణలపై సరండర్ చేసిన విషయం తెలిసిందే.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

14 గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- మూడు పెద్ద మోటర్లు ఒకేసారి కాలిపోడంతో వారం రోజులుగా అవస్థలు
- అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం

లచ్చన్నపాలెం సర్పా నదిలో టీడీపీ హయాంలో భారీ తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు


లచ్చన్నపాలెం సర్పానదిలో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టు

మాకవరపాలెం, మే 31: ఎండలు మండుతుండడంలో పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటుతుండగా, మరికొన్ని గ్రామాల్లో మోటార్లు పాడై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా బిందెడు నీటి కోసం మహిళల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మాకవరపాలెం మండలంలోని లచ్చన్నపాలెంలో గల భారీ తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన మోటర్లు కాలిపోయాయి. దీంతో వారం రోజులుగా 14 గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లచ్చన్నపాలెంలో గల సర్పానదిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.పది కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. దీని ద్వారా పద్నాలుగు గ్రామాలకు తాగునీరు అందేది. ఈ ప్రాజెక్టుకు మూడు పెద్ద మోటార్లు, రెండు చిన్న మోటార్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఇక్కడి మూడు పెద్ద మోటర్లు ఒకేసారి కాలిపోయాయి. దీంతో వారం రోజులుగా మండలంలోని మాకవరపాలెం, లచ్చన్నపాలెం, దాలింపేట, పైడిపాల, తామరం, పెద్దిపాలెం, బూరుగుపాలెం, చామంతిపురం, తాడపాల, తూటిపాల, మామిడిపాలెం, పోతలూరు, అడిగర్లపాలెం, పాపయ్యపాలెం తదితర గ్రామాలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మండు వేసవిలో తాగునీటికి కష్టాలు పడుతున్నా మోటార్ల మరమ్మతుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ఆయా గ్రామాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మోటార్లను బాగుచేయించి, తమ తాగునీటి కష్టాలు తీర్చాలని పద్నాలుగు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



గొలుగొండ మండలం జమ్మాదేవిపేటలో...

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మాదేవిపేటలో నెల రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ సుమారు యాభై కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఇంటింటికీ నీటిని అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. భారీ ట్యాంకు నిర్మించి మోటారు ద్వారా దానికి నీటిని మళ్లించేవారు. ఆ తరువాత కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేవారు. నెల రోజుల క్రితం ఈ పథకానికి సంబంధించిన మోటారు పాడైంది. దీంతో నాటి నుంచి నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. అలాగే గ్రామంలో రెండు చేతిబోర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి భూగర్భ జలాలు అడుగంటడంతో నిరుపయోగంగా మారింది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



రహదారికి ఇరువైపులా చెట్ల నరికివేత

- ఉపాధి హామీ నిధులతో పెంచామన్న ఏపీవో
- విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరుతో తొలగించారని ఆగ్రహం
- పర్యావరణ విభాగం, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



వైడీపేట వద్ద తాండవ జంక్షన్- నాతవరం రహదారి పక్కన చెట్లను నరికిన దృశ్యం

నాతవరం, మే 31: ఇక్కడి తాండవ జంక్షన్- నాతవరం ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉపాధి హామీ నిధులతో పెంచిన చెట్లను నరికివేయడంపై పర్యావరణ విభాగం అధికారులకు, నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని నాతవరం మండల ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు శుక్రవారం తెలిపారు. ప్రయాణికులకు నీడనివ్వాలన్న ఉద్దేశ్యంతో మూడేళ్ల క్రితం రెండు లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో తాండవ జంక్షన్- నాతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వైడీపేట (మర్రిపాలెం) నుంచి నాతవరం వరకు రెండు వైపులా 1100 మొక్కలు నాటామన్నారు రోజూ నీరు పోసి, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పెంచినట్టు చెప్పారు. తాము రోడ్డుకు రెండు వైపులా మొక్కలు నాటినప్పటికి విద్యుత్ స్తంభాలు లేవన్నారు. అయితే కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గోతులు అవసరం కావడంతో పెంచిన చెట్లను నరికివేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎప్పుడైనా విద్యుత్ వైర్లకు కొమ్మలు అడ్డువస్తే ఆ కొమ్మలను మాత్రమే నరుకుతారన్నారు. కానీ ఇలా కష్టపడి పెంచిన చెట్లను నరకడం తగదన్నారు. తమ అనుమతి లేకుండా చెట్లు నరికి వేసిన వ్యక్తులపై పర్యావరణ అధికారులకు, నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏపీవో చిన్నారావు వెల్లడించారు.

గొడవలను ప్రేరేపిస్తున్న సజ్జలను అరెస్టు చేయాలి

- పట్టణ సీఐకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ ఫిర్యాదు


సీఐకు ఫిర్యాదు చేస్తున్న బుద్ద నాగజగదీష్

అనకాపల్లి టౌన్, మే 31: ఓట్ల లెక్కింపు జరిగే నాల్గో తేదీన ఎన్నికల నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ సీఐ జి.శంకరరావుకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతున్నామన్న భయంతో కౌంటింగ్ హాల్‌లో నిబంధనలు పాటించాల్సిన అవసరం లేదని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకు అధికార దర్పం, అహంకారంతో విర్రవీగారని, అరాచక పాలన సాగిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులపై దాడులు, ఆస్తినష్టం, ఊరిలోంచి తరిమి వేసిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిని చూడాలని, నిరుద్యోగ నిర్మూలనకు చంద్రబాబు సరైన నాయకుడని గుర్తించారని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగి పది రోజుల వరకు మాట్లాడని సజ్జల వైసీపీ సమావేశంలో పార్టీ శ్రేణులను రాష్ట్రమంతటా అల్లకల్లోలం చేయాలని పిలుపునిచ్చారన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని జరిగిన సంఘటనలపై విచారణ చేయాలని నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐను కలిసిన వారిలో టీడీపీ నాయకులు మళ్ల గణేష్, బొడ్డేడ మురళీ, బుద్ద కాశీ, విల్లూరి రమణబాబు, బుద్ద భువనేశ్వరరావు ఉన్నారు.

చెరకులో అధిక దిగుబడులకు మేలైన రకాలు ఎంపిక చేసుకోవాలి

- అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆర్‌డీ డాక్టర్ పీవీకే జగన్నాథరావు


చెరకు రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ పీవీకే జగన్నాథరావు

సబ్బవరం, మే 31: చెరకులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు మేలైన రకాలు ఎంపిక చేసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం రీజినల్ డైరెక్టర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. శుక్రవారం స్థానిక జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో 'అఖిల భారత పరిశోధన సమన్వయ పథకం' ద్వారా ఎస్‌సీ చెరకు రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బెల్లం దిగుబడి పెరిగి, అధిక లాభాల కోసం సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు మెరుగైన విత్తన ఎంపిక అవసరమన్నారు. అంతకుముందు శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, విశాలాక్షి, చంద్రశేఖర్ చెరకు తెగుళ్ల నివారణ చర్యలపై 70 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం రైతులకు ఎరువుల, వర్మీ కంపోస్టు బస్తాలు, స్ప్రేయర్లు, స్టీల్ బకెట్లు, బెల్లం కలుపుకునేందుకు డ్రమ్ములు అందజేశారు. జాగృతి ఎండీ కందర్ప సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాగృతి కన్సల్టెంట్ వీవీ సుబ్రహ్మణ్యం, సీఈవో కేఎల్‌ఎన్ మౌక్తిక, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లకు నోటీసులు

- ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్


పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఈఓ పీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట, మే 31: మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేస్తున్న అక్రమ లేఅవుట్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం పాయకరావుపేట, అరట్లకోట, పీఎల్.పురం, సీతారాంపురం, శ్రీరాంపురం, పాల్మన్‌పేట, పెదరాంభద్రపురం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అక్రమ లేఅవుట్లపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అనుమతుల్లేకుండా లేఅవుట్లు వేస్తున్న వారికి తక్షణం నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. వ్యవసాయ భూములను లేఅవుట్లుగా అభివృద్ధి చేయాలనుకున్నవారు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే పనులు చేపట్టాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యదర్శులు జె.చంద్రశేఖర్, వై.సత్యనారాయణ, బీఏబీఎల్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో కార్డెన్ సెర్చ్


- 28 వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనాలతో పోలీసులు

పరవాడ, మే 31: గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో శుక్రవారం పరవాడ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సీఐ బాల సూర్యారావు ఆధ్వర్యంలో పోలీసులు ఉదయం ఐదు నుంచి పది గంటల వరకు కాలనీలో తనిఖీలు చేశారు. ఎటువంటి రికార్డులు లేకుండా ఉన్న 28 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు మల్లేశ్వరరావు, శ్యామలరావు, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్, పండ్ల దుకాణాలపై దాడులు

- మొత్తం 20 నమూనాలను సేకరించాం
- ఆహార భద్రతా విభాగం అధికారి రవికుమార్


ఓ దుకాణంలో వివరాలు నమోదు చేస్తున్న రవికుమార్

నర్సీపట్నం, మే 31: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల ఓ హోటల్, అబీద్ సెంటర్‌లోని పండ్ల దుకాణాలపై ఆహార భద్రతా సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్-2 ఆహార భద్రతా అధికారి బి.రవి కుమార్ మాట్లాడుతూ పాడైన చట్నీ వేశారని ఓ వినియోగదారుడు వాట్సాప్ ద్వారా తెలిపిన సమాచారం మేరకు సదరు హోటల్‌లో ఐదు శాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే పండ్లను మగ్గ పెట్టడానికి రసాయనాలు వినియోగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులతో పండ్ల దుకాణాలలో 15 నమూనాలు సేకరించినట్టు చెప్పారు. మొత్తం ఇరవై నమూనాలను ల్యాబ్‌కి పంపించామని, వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు చేపడతామని ఆయన వివరించారు.

ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ


మాట్లాడుతున్న సూర్యనారాయణ

అచ్యుతాపురం, మే 31: ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్‌లో నిధులు పెంచి మౌళిక సదుపాయాలను కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రెపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పెదపాడులో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినసరి కూలీ స్లిప్‌లు గతంలో ఇచ్చేవారని, దీని వల్ల తమకు రోజుకు ఎంత కూలి వస్తుందే తెలిసేదన్నారు. ప్రస్తుతం స్లిప్‌లు ఇవ్వడం లేదన్నారు. కూలీలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో కార్డెన్ సెర్చ్


కోటవురట్లలో పోలీసులు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

కోటవురట్ల, మే 31: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం కోటవురట్ల జంక్షన్‌లో సీఐలు అప్పన్న, విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఎటువంటి పత్రాలు లేని 150 వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున నుంచి కోటవురట్ల, రెల్లివీధి, గవరపేట, సంతబయిల కోలావారి వీధి, ముస్లిం వీధిల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులు చూపిస్తే వాహనాలను తిరిగి అందజేస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న 150 వాహనాల్లో 110 వాహనాలకు రికార్డులు ఉండగా.. 40 వాహనాలకు రికార్డులు లేవన్నారు. రికార్డు లేని వాహనాలు సీజ్ చేసి కోటవురట్ల పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నామన్నారు. కార్డెన్ చర్చ్‌ను ఎస్‌ఐలు విభూషణరావు(ఎస్.రాయవరం), జోగారావు (పాయకరావుపేట), రమణయ్య(కోటవురట్ల), నాలుగు స్టేషన్ల పోలీసు సిబ్బంది నిర్వహించారు.

ఐదు మాసాల్లో 120 మంది ఆదివాసీల హత్య

- నిజ నిర్ధారణ కమిటీని అడ్డుకున్న పోలీసు బలగాలు
- బెదిరింపులు, బుజ్జగింపులు
- రాజ్యం పోలీసుల నిర్బంధఖాండను ఖండిద్దాం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ ఆరోపణ


ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆదివాసీ హక్కుల పోరాట కమిటీ సభ్యులు

చింతూరు, మే 31: ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదు మాసాలుగా మారణకాండ జరుగుతోందని, ఈ క్రమంలో మావోయిస్టుల ముద్రవేసి 120 మంది ఆదివాసీలను పోలీసు బలగాలు హత్య చేశాయని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. ఈ మేరకు కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతృత్వంలో 60 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ గురువారం తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ చేరుకొని అక్కడి బాధిత కుటుంబాలను కలిసే ప్రయత్నం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నారాయణరావు, మాదన కుమార స్వామి, జాబిలి (తెలంగాణ) నాయకత్వంలో బయలుదేరిన బృందాన్ని తెర్లగూడ వద్ద పోలీసు బలగాలు అడ్డుకున్నారన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపి వెనుతిరిగి వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆ ప్రకటనలో ఆరోపించారు. తామంతా ప్రయాణంతో అలసిపోయామని బీజాపూర్ చేరుకొని అక్కడ విశ్రాంతి తీసుకుంటామని ఎంతగా నచ్చచెప్పినా తమ మాటను పెడచెవిన పెట్టిన బలగాలు బెదిరింపులకు దిగాయని ఆరోపించారు. చివరకు కమిటీని భద్రాచలం తిప్పి పంపారన్నారు. దీంతో శుక్రవారం వయా చింతూరు మీదుగా దంతెవాడ చేరుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కుంట సరిహద్దున బలగాలు అడ్డుకోవడంతో పాటు తమను పారా మిలటరీ బలగాలు చుట్టుముట్టాయన్నారు. దీంతో తాము రోడ్డుపైనే బైటాయించామని తెలిపారు. బలగాలు బుజ్జగించడం మొదలుపెట్టాయన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో తరచూ కాల్పులు జరుగుతున్నాయని అక్కడకు వెళ్లడం సరికాదంటూ బలగాలు చెప్పాయన్నారు. చివరకు అక్కడి నుంచి కూడా తమను వెనక్కు తిరిగి పంపారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న మారణ ఖాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, హక్కులను బలగాలు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కమిటీ తీవ్రంగా ఖండించింది. తమను ఛత్తీస్‌గఢ్‌లోకి అనుమతించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.



అభ్యర్థుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అభిషేక్

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

▸▸ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అభిషేక్

అరకులోయ, మే 31: ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఈవీఎంల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతీ రౌండ్‌లో , రెండు ఈవీఎంలను చెక్ చేస్తామన్నారు. ప్రతీ రౌండ్‌లో వచ్చిన ఓట్లను లెక్కించి ఎప్పటిక పుడు మీడియా సెంటర్‌కు సమాచారం అందిస్తామన్నారు. ఐదు వీవీ ప్యాట్‌లను ఎంపిక చేసి క్రాస్ లెక్కింపు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కంట్రోల్ యునిట్‌లో నమోదైన ఓట్లను లెక్కింపు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సుధాకర్, వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

డీఎస్‌వో శ్యామ్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు



డీఎస్‌వోను సత్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత, డీఆర్వో, ఎస్డీసీ తదితరులు

పాడేరు మే 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పౌర సరఫరాల అధికారి శ్యామ్‌కుమార్‌కు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత, ఇతర అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ ఎం.విజయసునీత పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. అలాగే పలువురు అధికారులు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, ఎస్‌డీసీ పి.అంబేద్కర్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.గణేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, ఎల్‌డీఎం రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అకౌంటెంట్ రమణ సేవలు అభినందనీయం

▸▸ జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు



డీఎస్‌వోను సత్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత, డీఆర్వో, ఎస్డీసీ తదితరులు

చింతపల్లి, మే 31: గూడెంకొత్తవీధి బ్రాంచి అకౌంటెంట్ చిటికెల రమణ సేవలు అభినందనీయమని జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన అకౌంటెంట్ రమణకు డివిజన్ కార్యాలయంలో జీసీసీ ఉద్యోగులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థలో రమణ 34 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారన్నారు. కనీస సదుపాయాలు లేని సమయంలో గిరిజన ప్రాంతంలో స్థానికంగా నివాసం ఉంటూ ఆదివాసీలకు సేవలందించడంతో ప్రధాన భూమిక పోషించారన్నారు. అందరితో మమే కమైఉద్యోగం చేయడం వల్ల ఆదివాసీలకు సన్నిహితులయ్యారన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఆయన సేవలను జీసీసీ వినియోగించుకుంటుందని డీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం కార్యాలయ అకౌంటెంట్ బీఏ రాజు, గ్యాస్ ఇన్‌చార్జి లొంజ రమణమూర్తి, అడ్వకేట్ ప్రకాశ్, డివిజన్, బ్రాంచి ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ పక్కాగా అమలుచేయాలి



భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏడీ అప్పారావు

పెదబయలు, మే 31: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పక్కాగా మెనూ అమలు చేయాలని ఎండీఎం అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) గిడ్డి అప్పారావు ఆదేశించారు. మండలంలోని సీతగుంట పాఠశాలలోభోజన పథకం నిర్వాహకులకు శుక్ర వారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని చెప్పారు. ఆహారం రుచిక రంగా ఉండడంతో పాటు పరిశుభ్రంగా అందించాలని వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. నిర్వాహకులు బాధ్యతగా నడుచుకోవాలని చెప్పారు. అనంతరం వివిధ వంటకాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పథకం జిల్లా సహాయసమన్వయకర్త వి.వెంకటరమణ, సీఆర్‌పీలు మత్యరాజు, ఉపేంద్ర, రవి, భవానీ, కోటేశ్వరరావు పాల్గొన్నారు. సీవోలు ప్రవీణ్, బాలరాజు,

కూరగాయల సాగు.. లాభాలు బాగు

... 5వ పేజీ తరువాయి

ఇందులో అంతర్ పంటగా వేసిన ఆగాకర అంది వస్తుంది. ఆగస్టు రెండవ వారం నుంచి ఆగాకర ఫలసాయం చేతికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇలా రెండు పంటలు ఒకే చోట సాగు చేయడం వల్ల ఎకరానికి పురుగు మందులు, ఎరువులు, తదితర పెట్టుబడులకు రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. బీర సాగు ఆదాయంతో పెట్టుబడి ఖర్చులు పోతాయని, అనంతరం ఆగాకర ఫలసాయం ద్వారా ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని, ఇది లాభంగా మిగులుతుందని రైతులు అంటున్నారు. దీంతో ఈ ఏడాది మండలంలో సుమారు 500 ఎకరాలకు పైగా కూరగాయల సాగుకు రైతులు ఉపక్రమించడం విశేషం.

ఆదాయం బాగుంది



గత ఏడాది ఇదే తరహాలో రెండు రకాల కూరగా యలు సాగు చేసి ఎకరానికి రూ.60 వేలు ఆదాయం పొందాను. ఈ సంవత్సరం అదనంగా మరో రెండు ఎకరాల్లో కూరగాయల సాగు చేపడుతున్నాను. పెట్టు బడి పోనూ రెట్టింపు ఆదాయం కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నాను.

\- వనగల శివ, రైతు, ఆర్.కంఠారం

ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు

▸▸ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత



పాడేరు డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కౌంటింగ్ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీ లించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ హాలుకు ఈవీఎంల భద్రంగా తరలించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు వేర్వురుగా ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కౌంటింగ్ హాలులో ఈవీఎంలకు, పోస్టల్ బ్యాలెట్‌లకు నిర్దేశించిన టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మొత్తం కౌంటింగ్ కేంద్రాల సమీపంలో ప్రత్యేక అత్యవసర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచాల న్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూముల నిత్య పర్యవేక్షణలో భాగంగా ఆమె తనిఖీ చేశారు. ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత విషయంలో పక్కాగా వ్యవహరించా లని భద్రతా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, ఎస్డీసీ కలెక్టర్ పి.అంబేద్కర్, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈఈ పి.అనుదీప్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కోసం ప్రజల ఎదురుచూపులు

▸▸ టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వరి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత జ్ఞానేశ్వరి

చింతపల్లి, మే 31: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారని అరకు పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి చెప్పారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వ్యతిరేకత పెరిగిందన్నారు. దీంతో వైసీపీని గద్దె దించేందుకు ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు వేశారన్నారు. కొన్ని చోట్ల రాత్రి వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొని ఓటు వేశారన్నారు. ఈ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు కూటమి పక్షాన నిలబడ్డారన్నారు. ఎన్నికల ఫలితాలు వైసీపీ నాయకులకు కనువిప్పు కలిగిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో కచ్చితంగా కూటమి ప్రభుత్వం వస్తుందని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆమె పేర్కొన్నారు. పాడేరు నియోజక వర్గంలోనూ టీడీపీదే విజయని, పార్టీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల బేతా ళుడు, సరమండ శ్రీధర్, బేతా సూకరత్నం, రహ్మత్‌బీబీ, కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కవడం చిటుకులయ్య, అడపా వీరబాబు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనారోగ్యం

▸▸ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ సాధన

▸▸ జిల్లా కేంద్రంలో పొగాకుకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ



అంబేడ్కర్ సెంటర్‌లో పొగాకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సిహెచ్.సాధన తెలిపారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడ చేపట్టిన అవగాహన ర్యాలీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యక్షంగా మనకు తెలియకుండానే పొగాకు విని యోగంతో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. అలాగే ఒకరు పొగాకును వినియోగించడం వల్ల వచ్చే పొగను పీల్చిన మరొకరు సైతం అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారు. అతిగా పొగాకు వినియోగంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని నిపుణులు సూచిస్తున్నారన్నారు. పొగాకు వినియోగం వల్ల ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టాలు కలుగుతున్నాయని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని డీఐవో కోరారు. స్థానిక జిల్లా ఆస్పత్రి నుంచి ఎంపీడీవో కార్యాలయం, మెయిన్‌బజార్, అంబేడ్కర్ కూడలి మీదుగా ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రయ్య సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీఎస్ఎన్.రాజు, ఎన్‌టీసీపీ విభాగం కౌన్సిలర్లు మనోజ్‌కుమార్, శాంతకుమారి, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, మినుములూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మలేరియా మందులకు కొరత లేదు

▸▸ జిల్లా మలేరియా నివారణ అధికారి పీవీఎస్.ప్రసాద్



చింతపల్లి క్యాంప్‌లో మలేరియా నివారణ చర్యలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ప్రసాద్

సీలేరు, మే 31: జిల్లాలో మలేరియా నివారణకు సంబంధించిన మందుల కొరత లేదని జిల్లా మలేరియా నివారణ అధికారి పీవీఎస్.ప్రసాద్ తెలిపారు. గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం ఏపీఎం మొదటి విడత పిచికారీ చేసిన చింతపల్లి క్యాంప్, జీడీసీక్యాంప్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌డీ కిట్లు, ఏసీటీ, ప్రేమాక్విన్ మందులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఏడాది మలేరియా మరణాలు సంభవించలేదన్నారు. గత ఏడాది జిల్లాలో 3,700 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 715 కేసులు వచ్చాయని చెప్పారు. జూన్, జూలైలో కేసులు నమోదు కావచ్చునని చెప్పారు.

పది పీహెచ్‌సీల పరిధిలో మలేరియా కేసులు

జిల్లాలో మొత్తం 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, పది పీహెచ్‌సీల పరిధిలోనే అత్యధికంగా మలేరియా కేసులు నమోదవు తుంటాయని డీఎంవో ప్రసాద్ తెలిపారు. అనంతగిరి మండలం పినకోట, భీమవరం, అరకు మండలం గెన్నెల, పినగడ, పాడేరు, చింతపల్లి, రంపచోడవం పరిధిలోని మారేడుమిల్లి, చింతూరు మండ లంలో తులసిపాకలు, ఏడురాళ్లపల్లి పరిధిలోనే కేసులు ఎక్కువన్నారు.

రెండు విడతలుగా ఐఆర్ఎస్ మందు పిచికారీ

మలేరియా నివారణకు రెండు విడతలుగా ఐఆర్ఎస్ పిచికారీ చేయిస్తున్నామని డీఎంవో ప్రసాద్ చెప్పారు. దోమతెరలు వినియోగం మలేరియాకు దూరం చేస్తుందన్నారు. మలేరియా నివారణలో భాగంగా 1767 గ్రామాలను ఐఆర్ఎస్ పిచికారీకి ఎంపిక చేయగా, 1,538 గ్రామాల్లో మొదటివిడత ప్రక్రియ పూర్తయిందన్నారు. 229 గ్రామాల్లో జూన్ 15వ తేదీలోగా పూర్తిచేస్తామన్నారు. రెండో విడత జూలై 1 నుంచి ఆగస్టు 30 వరకు పిచికారీ చేస్తామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ధారకొండ, సప్పర్ల పీహెచ్ సీలను కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ మలేరియా అధికారి ఎ.సత్య నారాయణ, కన్సల్టెంట్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు, సీలేరు వైద్యాధికారి కె.సౌమ్య, సిబ్బంది త్రినాథ్, బాలామణి, సత్యనారాయణ ఉన్నారు.

భారీగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

పందాలు కాసిన ఎంతోమంది ఇప్పుడు సైలెంట్ అయి పోయారు. కూటమి అభ్యర్థి తరపున అధిక మొత్తాన్ని ఇస్తామని ఆఫర్ చేస్తున్నా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలపై భారీగా పందాలు సాగుతున్నాయి.

కీలక స్థానాల్లో మెజారిటీపైనా..

రాష్ట్రంలో కీలక నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీపైనా పెద్దఎత్తున పందాలు సాగుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజారిటీలపై జోరుగా పందాలు సాగు తున్నాయి. వీరి ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తుందన్న దానిపైనా బెట్టింగ్ జరుగుతోంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ కనీసం 30 వేలకుపైగా మెజారిటీ సాధి స్తారంటూ పందాలు కడుతున్నారు. అలాగే జనసేన పోటీ చేసిన స్థానాల్లో సగానికిపైగా గెలుచుకుంటుందని, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ లభించే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. కడపలో అవినాష్‌రెడ్డి గెలుపు/ ఓటమి, మెజారిటీపై కూడా పందాలు సాగుతున్నాయి.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

గతంలో ఎన్నడూ పందాలు గురించి పట్టించుకోని ఎంతో మంది ఈసారి బెట్టింగ్‌కు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. వీరిలో చిన్న, పెద్ద అంతా ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.కోటి, అంతకు మించి పందాలు సాగుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల బెట్టింగ్ జరిగినట్టు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏపీలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తారంటూ బెట్టింగ్ కడుతుండగా, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కూటమి వైపు పందాలు కాస్తున్నారు. ఈసారి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బెట్టింగ్‌లో భాగస్వామ్యులు కావడం గమనార్హం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూటమి గెలుస్తుందంటూ భారీ మొత్తంలో బెట్టింగ్ కట్టారు.

చింతపల్లిలో ఎండ, వాన!

... 5వ పేజీ తరువాయి



చింతపల్లిలో హోరున కురుస్తున్న వాన

వాతావరణం చల్లబడింది. నాలుగు రోజులుగా గిరిజన గ్రామాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది. చింతపల్లిలో మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం అల్లాడి పోయారు. మూడు నుంచి ఐదు గంటల వరకు వర్షం పడడంతో ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. ఐటీడీఏ క్వార్టర్స్ వద్ద విద్యుత్ తీగలపై చెట్లకొమ్మ లు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



చింతపల్లిలో ఎండ తీవ్రతకు గొడుగు వేసుకున్న వర్తకురాలు

డుంబ్రిగుడలో మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న డుంబ్రిగుడ ప్రధాన రహదారి

డుంబ్రిగుడ: మండలంలో ఎండలు మండుతున్నాయి ఉదయం 6 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్న సమ యంలో అగ్నిగుండలా మారుతున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం భయపడుతున్నారు. ప్రధాన రాహ దారి నిర్మానుష్యంగా కనిపిస్తోంది. అరకు సంతబయలలో శుక్రవారం జరిగిన సంతలో గిరిజనులు గొడుగు నీడలో కూర గాయలు విక్రయాలు సాగించారు. మండ లంలోని కించుమండ పంచాయతీ కేంద్రం ఎండ తీవ్రతతో నిర్మనుష్యంగా మరింది.

ముంచంగిపుట్టులో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ముంచంగిపుట్టు: మండల పరిధిలో రెండు రోజులుగా ఎండలు రారెత్తిస్తున్నాయి. ఎండ వేడికి పిల్లలు, వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు విజృంభిస్తున్నాయి. దీంతో వివిధ పనులపై మండల కేంద్రం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

కొండదొర తెగ విద్యార్థులకు ధ్రువపత్రాలు జారీ చేయాలి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు రూరల్, మే 31: ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యను పరిష్కరించి ఎస్టీ కొండదొర తెగ విద్యార్థులకు ధ్రువపత్రాలు జారీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. శుక్ర వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ తప్పిదం కారణంగా ఆదివాసీ గిరిజన తెగలు ఇబ్బందు లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆదివాసీ తెగలకు ధ్రు పత్రాలు జారీ విషయంలో తరచూ ఇబ్బందులు ఎదుర వున్నాయని ఆరోపించారు. రెవెన్యూ శాఖాధికారులు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల పేరుతో తెగల పేర్లు కనిపించడం లేదని చెబుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. 2022లో ఎస్టీ భగత, కమ్మరి, మాలి, వాల్మీకులకు ధ్రువపత్రాల జారీలో ప్రభుత్వ జాప్యం కారణంగా వందలాది మంది విద్యార్థులు కళాశాలలు, పాఠశాలల్లో ప్రవేశాలను కోల్పో యారని, ఈ పరిస్థితి మరలా ఎదురవుతున్నదని చెప్పారు. కొండ దొర తెగకు ధ్రువపత్రం జారీలో జాప్యం చేసిన వెబ్‌సైట్ నిర్వాహకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త

▸▸ వైద్యాధికారి సౌమ్య



మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

సీలేరు, మే 31: ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోద వుతున్న తరుణంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ కొన్ని జాగ్రత్తలను పాటించాలని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.సౌమ్య సూచించారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ సీలేరు పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ఎక్కువగా వృద్ధులు, చిన్నారులు డీహైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. డీహైడ్రేషన్ బారి నుంచి రక్షణకు కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలని, ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో బయట తిరగకూడద న్నారు. ఎండల్లో పనిచేసేవారు ఎక్కువగా మంచినీరు, మజ్జిగ తీసుకోవాలని చెప్పారు. ఈ సమయంలో మద్యం, శీతల పానీయాలు తీసుకోకూడదని, మద్యం తాగితే ఎక్కువగా డీహైడ్రేషన్ బారిని పడే ప్రమాదం ఉందని డాక్టర్ సౌమ్య హెచ్చరించారు.

కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి

చింతపల్లి, మే 31: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనా రాయణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలతో విద్యార్థులకు మెనూ ఆధారంగా భోజనాలు పెట్టడం నిర్వాహకులకు ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో వారికి ఆర్థిక భారం పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కింతర్ల కుమారి, సాగిన కుమారి, పరమేశ్వరి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు బంద్

చింతపల్లి, మే 31: మండలంలో రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు స్తంభించిపోయాయి. దీంతో విని యోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆన్‌లైన్ సేవలు నిలిచిపో యాయి. మండలంలోని పలు గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ గురువారం అందలేదు. శుక్రవారం రాత్రి వరకు సాంకేతిక సమస్యను బీఎస్ఎన్ఎల్ అధికారులు పరిష్కరించలేదు. ఇప్పటికైనా వినియోగదారుల అవస్థల ను గుర్తించి బీఎస్ఎన్ఎల్ అధికారులు సేవలను పున రుద్ధరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల నివారణ మందు స్ప్రేయింగ్‌కు సహకరించాలి

ముంచంగిపుట్టు, మే 31: దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులకు అందరూ సహకరించాలని దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి సూచించారు. పంచాయతీ పరిధిలో శుక్రవారం రంగెలిసింగి, డీంంగుడ, డొక్రిపుట్టు తదితర గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. వారిని పరిశీలించిన సర్పంచ్, స్వయంగా పలు ఇళ్లకు అతను స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఇళ్ల లోపల బయట, దోమల మందును స్ప్రేయింగ్ చేయిం చుకోవాలని సూచించారు. అలాగే మలేరియాతో పాటు ఇతర వ్యాధుల బారిన పడకుండా వైద్యుల సలహాలు, సూచనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.అర్జయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్

చింతపల్లి, మే 31: మండల కేంద్రంలోరని రామా లయం, మైలుకూలివీధి, నెయ్యలవీధి, కుమ్మరవీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేసినట్టు ఈవోపీఆర్‌డీ శ్రీని వాసరావు చెప్పారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో పలు గ్రామాల్లో దోమ కాటు వల్ల జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీంతో ఫాగింగ్ చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించామన్నారు. చింతపల్లిలో ప్రతీ ఏడాది కొన్ని వీధుల్లో డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలుతు న్నాయని, ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి వీధిలోనూ ఫాగింగ్ చేస్తున్నామని ఆయన చెప్పారు. వీధులను ఎ ప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఆలాగే వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు దోమల నివారణపై అవగా హన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి

కొయ్యూరు, మే 31: మండలంలో బూదరాళ్ల పంచాయతీలోని గొర్రెలమెట్ట గ్రామానికి చెందిన సీదేరి దేవరాజు (27) శుక్రవారం పిడుగుపడి మరణించాడు. కుటుంబీకులు అందించి వివరాల ప్రకారం... దేవరాజు శుక్రవారం మధ్యాహ్నం పశువుల కాపు కోసం సమీప కొండకు వెళ్లాడు. సాయింత్రం 4 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుం డడంతో చెట్టు కింద తలదాచుకొన్నాడు. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో దేవరాజు అపస్మారక స్థితికి చేరాడు. ఇది గుర్తించిన సమీపంలో పశువులు కాపరులు హుటాహుటిన ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. దేవరాజు భార్య గొర్రెలమెట్ట గ్రామ ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దేవ రాజు మృతితో గొర్రెలమెట్ట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. భర్త అకాల మరణంతో ఆధారం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని దేవి కోరారు.